# హల్లెలూయా

## (కీర్తనల గ్రంథం - సంగ్రహ సమీక్ష)

**I. ఉపోద్ఘాతం :** "జీవితం ఓ పాటవంటిది. ప్రతి ఒక్కరూ దానిని పాడితీరాల్సిందే" అన్నాడు ఓ కవి. పాటలో పల్లవి, అనుపల్లవి, యతిప్రాసల పదాలతో చరణాలు, శ్రుతిలయలతో పలురాగాలున్నట్లే మనిషి జీవితంలో సుఖదుఃఖాలు, కష్టనష్టాలు ఉంటాయి. ఇది దేవుడు ఏర్పాటు చేసిన నియమం (ప్రసంగి 7:14). జీవితంలో ఏ పరిస్థితిలోనైనా తెలిసికోవలసిన, నేర్చుకొని ఆచరణలో ఉంచవలసిన అనేక సత్యాలను మేళవించి వ్రాయబడిన సంకలనమే కీర్తనల గ్రంథం. పలు పరిస్థితుల్లోని మానవ హృదయస్పందనే ఈ స్తుతి, ఆరాధన, ప్రార్థన కీర్తనలు. భక్తుల జీవిత అనుభవాల్లోనుండి పెల్లుబికిన ఈ కీర్తనలను విశ్వాసులమైన మనం మన అనుభవాలుగా మార్చుకొంటే మన హృదయలోతుల్లో నుండి జీవధారలు ఊటలుగా ప్రవహిస్తాయి. మరెన్నో జీవితాలను తడుపుతాయి.

**1. గ్రంథకర్త :** ఈ గ్రంథంలోని 150 కీర్తనలలో అధిక భాగం దావీదుచే వ్రాయబడినందు వలన దీన్ని "దావీదు కీర్తనలు" అని కూడా పిలుస్తారు. వాస్తవంగా దావీదు-73, ఆసాపు-12, కోరహు కుమారులు 11, హిజ్కియా 10, సొలొమోను-1, ఏతాను-1, హేమాను-1 మొత్తం 111 కీర్తనలు వ్రాసారు. మిగతా 39 కీర్తనల రచయితలు ఎవరో సరైనా ఆధారాలు లేనప్పటికీ వీటిలో ఎక్కువగా దావీదే వ్రాసి ఉండొచ్చునన్న అభిప్రాయం ఉంది.

**2. గ్రంథ రచనకాలం :** క్రీ.పూ. 1440-586 సం॥ మధ్య కాలంలో అనగా 800 నుండి 1000 సంవత్సరాల కాలంలో వ్రాయబడ్డాయి.

**3. వ్రాయబడిన ఉద్దేశం :** కీర్తనీయుడైన దేవుణ్ణి స్తుతించి, ఆరాధించడమే గాక, పాపపు ఒప్పుకోలు ద్వారా దేవునితో సంబంధాన్ని పునరుద్ధరించుకోడానికి, అన్ని పరిస్థితులలో దేవుని సహాయం కోరుతు, ధైర్యపర్చబడేందుకు ఈ కీర్తనలు వ్రాయబడ్డాయి.

**4. గ్రంథ ముఖ్యాంశం :** "రాజు" "రాజ్యం"

**5. మూలపదం :** హల్లెలూయా (ప్రభువును స్తుతించుడి)

**6. మూల కీర్తనలు :** 50, 150

**7. గ్రంథ విశిష్ఠత :** బైబిలు గ్రంథంలోకెల్ల పెద్ద పుస్తకమైన కీర్తనల గ్రంథం బైబిల్లోనే కేంద్ర (మధ్య)స్థానం వహించింది. హెబ్రీ భాషలో ఈ గ్రంథ శీర్షిక "స్తుతి" లేక "స్తుతి పుస్తకం" అని వ్రాయబడింది. కీర్తనలు (PSALMS) అనే శీర్షిక గ్రీకు భాషనుండి

తీసికొనబడింది, ఆంబ్రోస్ అనే దైవజనుడు కీర్తనల గ్రంథాన్ని "సంఘస్వరాలు" అని, జాన్ కెల్విన్ అనే భక్తుడు "ఇది ఆత్మావయాలను పరిశోధించగల గ్రంథం" అని, హెర్డ్ అనే భక్తుడు "ఈ గ్రంథం అన్ని కాలాలకు, అన్ని సందర్భాలకు తగిన పాటల పుస్తకం" అని ఉద్ఘాటించారు.

ఈ కీర్తనలు క్రీస్తుతో నింపబడి ఉన్నాయి. ఈ గ్రంథంలో యేసుక్రీస్తు సమస్త విషయాల్లో మన సమస్తముగా ఉన్నట్లు కనిపిస్తాడు, సువార్తల్లో కంటే కీర్తనలలోనే ఆయనను గూర్చిన సంపూర్ణ వివరణ కనిపిస్తుంది. ఈ గ్రంథంలో క్రీస్తు ప్రవక్త పరిచర్య (22:22) యాజకుని పరిచర్య (40:6, 8; 22:29; 110) రాజు పరిచర్య (2:21; 45; 72) స్పష్టంగా వివరించబడింది. నిజానికి కీర్తనల్లో స్తుతిలో ప్రధానాంశం ఆయనే.

## II. గ్రంథ విభజన :

ఎ. ఈ గ్రంథంలోని కీర్తనల క్రమాన్ని బట్టి ఈ గ్రంథాన్ని 5 ప్రధాన భాగాలుగా విభజించవచ్చు. ఈ 5 భాగాలు పాత నిబంధనలోని పంచగ్రంథాలను సూచించడం ఈ గ్రంథ విశేషం.

అ) ఆదికాండ విభాగం (ప్రథమ స్కంధం) 1-41 కీర్తనలు

ఈ భాగంలో మానవుని గూర్చి (అనగా మానవుడు ఆశీర్వదించబడుట, మానవుని పతనం, తిరిగి సమకూర్చబడుట మొదలైన అంశాలు) వ్రాయబడ్డాయి.

1. పరిపూర్ణ మానవుడు (కడపటి ఆదాము) – 1వ కీర్తన.
2. తిరుగుబాటు చేసిన మానవుడు – 2వ కీర్తన.
3. పరిపూర్ణ మానవుడు తిరస్కరించబడుట – 3వ కీర్తన.
4. స్త్రీ సంతానమునకు – సర్పమునకు మధ్య పోరాటము – 4వ కీర్తన.
5. శత్రువుల మధ్య పరిపూర్ణ మానవుడు – 5వ కీర్తన.
6. దండనలో పరిపూర్ణ మానవుడు (మడిమె మీద కొట్టబడుట – 6వ కీర్తన)
7. అబద్ధ సాక్ష్యాల మధ్య పరిపూర్ణ మానవుడు – 7వ కీర్తన.
8. మానవుడు మానవుని ద్వారా బాగుచేయబడుట (తలమీద కొట్టుట) – 8వ కీర్తన.
9. శత్రువు మరియు క్రీస్తు విరోధి పోరాటం; అంతిమ విడుదల – 9-15 కీర్తనలు.
10. క్రీస్తు తన ప్రజల మధ్య ఉంటూ దేవునికోసం వారిని పరిశుద్ధపరచుట – 16-41 కీర్తనలు.

ఆ) నిర్గమ కాండ విభాగము (ద్వితీయ స్కంధం) 42-72 కీర్తనలు. (ఇశ్రాయేలు నాశనం మరియు విమోచనను దృష్టిలో ఉంచుకొని వ్రాయబడింది.)

1. ఇశ్రాయేలు నాశనము : 42-49 కీర్తనలు.
2. ఇశ్రాయేలు విమోచకుడు : 50-60 కీర్తనలు.
3. ఇశ్రాయేలు విమోచన : 61-72 కీర్తనలు.

ఇ) లేవీయకాండ విభాగము (తృతీయ స్కంధం) 73-89 కీర్తనలు. ఈ భాగం పరిశుద్ధ స్థలాన్ని దృష్టిలో ఉంచుకొని వ్రాయబడింది. చీకటి వెలుగులతో కూడిన సందర్భాలివి. ఈ కీర్తనలన్నిటిలో మందసం, మందిరం, ఇల్లు, పరిశుద్ధ సమాజం ఉదహరించబడ్డాయి.

ఈ) సంఖ్యాకాండ విభాగం (చతుర్ధ స్కంధం) 90-106 కీర్తనలు. ఈ భాగం భూమిని దృష్టిలో ఉంచుకొని వ్రాయబడింది. ఆపద కాపుదల ఈ కీర్తనల్లో ప్రధానాంశాలు.

ఉ) ద్వితీయోపదేశకాండ విభాగం (పంచమ స్కంధం) 107-150 కీర్తనలు. ఈ భాగంలో దేవుని వాక్య పరిపూర్ణత మరియు దేవుని వాక్యం ప్రస్తుతించబడుటను చూడగలం.

## బి. గ్రంథకర్తలను బట్టి విభజన :

1. దావీదు కీర్తనలు

ఎ) కాపరి కీర్తనలు (8,19,23,29,144)

బి) పాపము గూర్చిన కీర్తనలు (32,51,38)

సి) శ్రమా గీతాలు (3-7; 11-14; 17, 22; 25-28; 31,34,35; 39-41; 53-59; 61-64; 69,70,86,109,140-143)

డి) సంతృప్తి గీతాలు (2,9,15,16,18,20,21,24,30,36,37,52,60,65,68,72, 95,101,103,105,108,110,122,124,131,133,138,139,145)

2. కోరహు కీర్తనలు (42, 44-49; 84,85,87)
3. ఆసాపు కీర్తనలు (50, 73-83)
4. హేమాను కీర్తన (88)
5. ఏతాను కీర్తన (89)
6. సొలొమోను కీర్తన (127)
7. మోషే కీర్తన (90)
8. హిజ్కియా కీర్తనలు (120,121,123,125,126,128,129,130,132,134)
9. అనామక కీర్తనలు (1,10,33,43,66,67,71; 91-94; 96-100; 102, 104,106,107; 111-119; 135-137; 146-150)

## సి. అంశాలవారిగా విభజన మరియు సంక్షిప్త వివరణ :

**I. భక్తి గీతాలు :** (4,9,12-14; 16-19; 22-24; 27, 30-35; 37,40,42, 43,46,50,55,56; 61-63,66,68,69,71,73,75-77, 80,81,85,88,90, 91,94,95,100,103,106,107,116,118,119,122,123,126,133,136, 138,139,141,142,144,147-150) ఈ కీర్తనల ద్వారా మనం నేర్చుకోగల ప్రాముఖ్యమైన సత్యాలనే క్లుప్తంగా వివరిస్తున్నాము.

1. **దుష్టుల గతి :** (కీర్త 9:17) ఈ లోకం ఉన్నంతవరకు, ప్రభువు తిరిగి వచ్చేంత వరకు నీతిమంతులతో పాటు దుష్టులు కూడ ఈ లోకంలో ఉంటారు. వారి మధ్య జీవించడం విశ్వాసులకు కష్టమే అయినా వారి అంతము గూర్చిన విషయాలు ప్రభువులో మనం ముందుకు సాగడానికి సహాయం చేస్తాయి. కీర్తన 9:17 లో వ్రాయబడినది ఒకానొక దినాన వాస్తవం కాబోతున్నది. (మత్త 25:31-46; ప్రకటన 14:10; 19:20; 20:1-11; 21:8).

2. **బైబిలులోని భక్తులు :** కీర్తన 13:1,2 ఒక ప్రధాన సత్యాన్ని మనకు నేర్పిస్తున్నది. బైబిలులోని వ్యక్తులు లేక విశ్వాసులు ఇతర మానవులకు అతీతులు కారు. ఆధ్యాత్మికంగా వారు ప్రత్యేకమైన వారే గాని భావోద్వేగాలలో సాధారణ మానవుల్లాంటి వారే. (యాకో 5:17) ఆదాము సంతతిగా మనం ప్రస్తుతం అనుభవిస్తున్న వాటన్నిటిని బైబిలులోని వ్యక్తులు కూడ అనుభవించారు. అది వారి ప్రార్థనల్లో స్పష్టపరచబడింది. ఉదా :- దావీదు (కీర్త 6:1-7; 31:1-4) ఆసాపు (కీర్త 77:1-20); మేమాను (కీర్త 88:1-18) అనామకరచయిత (కీర్త 102:1-11; 137:1-6); మోషే (సంఖ్యా 11:1,12,14,15) యెహోషువ (యెహో 7:6-9); ఏలియా (I రాజు 19:4,10,14) యోబు (యోబు 3:3-12; 10:18-22) యిర్మీయా (4:10; 20:7-9, 14-18) యోనా (4:1-3) హబక్కూకు (1:2-4); కోరహు (కీర్త 42:3-11; 44:8-26).

3. **విశ్వాసిపట్ల దేవుని ప్రేమానురాగాలు :** కీర్తన 17:8 లో దావీదు ఒకడు తన కనుపాపను కాపాడుకొనునట్లు నన్ను కాపాడుము అని ప్రార్థించాడు. దేవుడు తన బిడ్డల్ని కనుపాపలా కాపాడుతాడు (ద్వితీ 32:10; జెక 2:8). అదే వచనంలో దావీదు నీ రెక్కల నీడ క్రింద నన్ను దాచుము అన్నాడు. ఈలాంటి దేవుని కాపుదలను గూర్చి వాక్యంలో పలు సందర్భాలలో పేర్కొనబడింది. (ద్వితీ 32:11; కీర్త 36:7; 57:1; 91:1,4; మత్త 23:37).

4. **విశ్వాసి శ్రమలు :** కీర్తన 18:16లో దావీదు తన శ్రమలను జలరాసులతో పోల్చాడు. బైబిలులో పలుచోట్ల నీరు శ్రమలకు సాదృశ్యంగా వాడబడింది. (కీర్త 69:1,2; 144:7; యెష 43:2). దేవుని పిల్లలు శ్రమల గుండా వెళ్ళాలి. అయితే దేవుడు వాటన్నిటిలో నుండి మనల్ని తప్పిస్తానని వాగ్దానం చేసాడు (కీర్త 91:15). దేవుడు శ్రమలనే జలరాసుల నుండి తనను ఎలా పైకి తీసాడో 19, 28, 25 వచనాలలో దావీదు వర్ణించాడు. మోషే నీటిలో నుండి తీయబడ్డాడు అనే ఉద్దేశంతో ఫరో కుమార్తె అతనికి ఆ పేరు పెట్టింది. తనకు తెలియకుండానే అలా నామకరణం చేసింది గాని అందులో ఓ గొప్ప ఆధ్యాత్మిక సత్యం దాగివుంది. దేవుని పిల్లలందరూ శ్రమలనే నీటిలో నుండి తీయబడిన అనుభవాలు గలవారే. అయితే తుదకు ప్రభువు మనల్ని జీవజలనదుల దగ్గరకి నడిపిస్తాడు. (ప్రకటన 7:17) కాబట్టి ఈ జలాల గుండా వెళ్ళడం ఎంత ధన్యకరమో ఆలోచించండి.

**5. కాపరియైన దేవుడు :** 22,23,24 కీర్తనలలో దేవుడు మన కాపరిగా వివిధ కోణాల్లో కనిపిస్తాడు. 22వ కీర్తనలో దేవుడు మంచి కాపరిగా కనిపిస్తున్నాడు (యోహా 10:11). ఇందులో క్రీస్తు సిలువ మరణం, ఆయన కృప జీవం కనిపిస్తాయి. 23వ కీర్తనలో గొప్ప కాపరిగా (హెబ్రీ 13:20) ఆధ్యాత్మిక విశ్రాంతి, నడిపింపు, సంతృప్తి, సహచర్యము, కాపుదలనిచ్చే వానిగా వర్ణించబడ్డాడు. 24వ కీర్తనలో ప్రధానకాపరిగా (Iపేతు 5:4) ఆయన సార్వభౌమత్వము, మన పట్ల గల ఆపేక్ష, మనకివ్వబోయే ప్రతిఫలం మరియు మహిమను గూర్చి వివరించబడ్డాయి

**6. దేవుని పిల్లల జీవితాల్లో దేవదూతల ప్రమేయం :** పరలోకపు తండ్రి తన పిల్లలకు సహాయం చేయడానికి, వారిని కాపాడడానికి మరియు ప్రోత్సహించడానికి తన దూతలను వాడుకొంటాడని కీర్తన 34:6-9 సూచిస్తున్నది. (II రాజు 6:17; హెబ్రీ 1:14; అపొ 12:7).

**7. నిస్పృహలో ఉన్నత స్థితికి ఎదుగుట :** 37వ కీర్తనలో విశ్వాసి నిరాశ, నిస్పృహలలో నుండి ఉన్నత స్థితిలోనికి ఎలా ఎదగగలడో వ్రాయబడింది (కీర్త 37:34). అందుకు నాలుగు మెట్లు ఇందులో సూచించబడ్డాయి.

అ) దేవుడు మన సమస్యకు జవాబివ్వగలడని నమ్మాలి. (37:3,5)

ఆ) ఆయన మన సమస్యను పరిష్కరిస్తాడని విశ్వసించి ఆనందించాలి. (37:4)

ఇ) మన సమస్యను ఆయన వద్దకు తీసికొని వెళ్ళాలి. (37:5)

ఈ) మన సమస్య ఇక మనది కాదు, అది ఆయన చేతిలో ఉందని విశ్రమించాలి. (37:7,9,34)

**8. రక్షణ ఆవశ్యకత - రక్షకుని విశిష్టత :** కీర్తన 40:1-3 వచనాలలో పాప ఊబిలో చిక్కుకున్న వ్యక్తి దుర్భరస్థితిని అందులో నుండి పైకి తీయబడిన విధానాన్ని వివరిస్తున్నాయి. ఒక వ్యక్తి ఓ లోతైన గుంటలో పడిపోయాడు, నన్ను రక్షించండి అనే కేకలు వేస్తున్నాడు. అతని కేకలు విని ఓ తత్త్వశాస్త్రజ్ఞుడు అక్కడికి వచ్చి ఆ గుంటలోనికి తొంగిచూచి "మిత్రమా! ఇంత లోతైన గుంటలో ఎలా పడ్డావు? జాగ్రత్తగా చూచుకొని నడవాలికదా? పోనీలే! మళ్ళీ ఇంకోసారి అలా పడిపోకుండ జాగ్రత్తగా నడువు" అని చెప్పి వెళ్ళిపోయాడు. మరి కొంత సేపటికి ఓ మత సంస్థాపకుడు ఆ కేకలు విని అక్కడికి వచ్చాడు. అతడు తొంగి చూచి "అయ్యో మిత్రమా! నీకు సహాయం చెయ్యాలని ఉంది. నీవు పైకి ఎక్కి నా చెయ్యి పట్టుకోగలిగితే పైకి లాగుతాను" అన్నాడు. కాని ఎముకలు విరిగి, గాయాలతో రక్తసిక్తమైయున్న ఆ క్షతగాత్రుడు పైకి ఎక్కలేదు. ఆ మత నాయకుడు కూడా వెళ్ళిపోయాడు. అలసిసొలసిపోయిన అతడు ఓపిక కూడగట్టుకొని రక్షించండి అని మళ్ళీ కేకలు వేసాడు. ఇంతలో ఓ వ్యక్తి వచ్చాడు. అతని దీనస్థితిని చూచాడు. అతని హృదయం కనికరంతో నిండిపోయింది. అతన్ని హెచ్చరించలేదు, అతడు చేయలేనిదానిని చెయ్యమని సలహా ఇవ్వలేదు గాని తానే ఆ

గోతిలోనికి దిగి అతన్ని మోసికొని పైకి తీసికొనివచ్చాడు. అతడు మరెవరో కాదుగాని మన రక్షకుడైన యేసుక్రీస్తే. గోతిలో ఉన్నవానిని పైకితెచ్చి, పాదాలను నిలువబెట్టాడు. అతని నోటిలో క్రొత్త కీర్తననుంచాడు. యేసుక్రీస్తుకు ఇతరులకు ఉన్న తేడా అదే.

**9. విశ్వాసి అభ్యాసం :** కీర్త 42:5,11 మరియు 43:5 లో ఓ ప్రశ్న కనిపిస్తున్నది. “నా ప్రాణమా, నీవేల క్రుంగి యున్నావు? నాలో నీవేల తొందరపడుచున్నావు?”. విశ్వాసులు ఎప్పుడో ఒకప్పుడు, తమకుతామే ఈ ప్రశ్నను వేసుకొనే అవకాశం ఉంది. అనేక పర్యాయాలు మన ప్రాణం లేక మనస్సు లేక హృదయం ఏదో ఒక దానిని బట్టి క్రుంగి పోయి, కలవరపడుతుంది, లేక తొందరపడుతుంది. కాని మన ప్రాణాన్ని సముదాయించుకొని, మన అంతరంగంలో మనమే నిశ్చయతతో కూడిన జవాబును పొందడం ద్వారా నెమ్మదిని శాంతిని కలిగి జీవించగలుగుతామని ఈ కీర్తనలు ఉద్బోధిస్తున్నాయి. అలా విశ్వాసి అభ్యాసం చెయ్యాలి (కీర్త 131:2,3)

**10. మహాశ్రమల కాలంలో ఇశ్రాయేలు భద్రత :** మహాశ్రమల కాలంలో ఇశ్రాయేలు శేషం, అంత్యక్రీస్తు బారి నుండి తప్పించబడి పెట్రా అనే స్థలంలో దాచి పెట్టబడే సంఘటనను కీర్త 46:1-3, 6-9 తెలియజేస్తున్నది. ఆ సమయంలో భయభ్రాంతులతో నిండి ఉన్న ఇశ్రాయేలు శేషానికి ఇది చాల ఇష్టమైన పాటగా ఉంటుంది. (యెష 26:19, 20; ప్రక 6:12-14; 12:14; మత్త 24:15,16)

**11. బల్యర్పణ - హృదయార్పణ :** ఆసాపు వ్రాసిన 50వ కీర్తనలోని 10-14 వచనాలు సంశయాత్మకమైనవి. దేవుడు బల్యర్పణను కోరని పక్షంలో బలులను ఎందుకు నియమించాడు? కేవలం మనిషి పాపాన్ని కప్పడానికి తక్షణ పాపక్షమాపణ పొందడానికే బలులు నియమించబడ్డాయి గాని వాటికంటె ఎక్కువగా విమోచించబడిన వారి ద్వారా తాను మహిమ పర్చబడాలనే దేవుడు కోరాడు (50:8,14,23). పాత నిబంధన కాలంలోని యూదేతరులు, హెబ్రీయుల దేవుడు మనిషికి సహాయం చేయడం కన్న తనకు అర్పించబడే బలులను గూర్చి ఎక్కువగా శ్రద్ధ కలిగి ఉన్నాడని విమర్శించేవారు. ఆసాపు దాన్ని ఖండిస్తూ దేవుడు బలులకన్న మనిషి హృదయాన్ని కోరుతున్నాడని స్పష్టం చేసాడు. కొన్ని శతాబ్దాల క్రితమే మోషే ఈ విషయాన్ని జ్ఞాపకం చేసాడు (ద్వితీ 10:12-16).

**12. కన్నీళ్ల విలువ :** మనం కార్చే కన్నీళ్ళు కూడా దేవుని దృష్టిలో ఎంత విలువైనది అని చెప్తే మీరు ఆశ్చర్యపోతారు. ప్రతి విశ్వాసి కన్నీళ్ళను దేవుడు తన కవిలెలో దాచిపెడుతున్నాడు. ఆదికాండం నుండి, ప్రకటన 5:4,5 వరకు ప్రతి భక్తుడు కార్చిన కన్నీళ్ళతో ఆయన కవిలెలో నిండుతుంది. అవన్నీ ఒకదినాన తుడిచివేయబడతాయి. ఇక దుఃఖమైనను ఏడ్పైనను వేదనయైనను మరెన్నడూ ఉండవు (ప్రక 21:4). ఈ గొప్ప ఆధిక్యత విశ్వాసులకు వారి కన్నీళ్ళలో గొప్ప ఆదరణనిస్తుంది.

**13. ప్రార్థనను గూర్చిన అసలైన సూత్రం :** బైబిలంతటిలో, ముఖ్యంగా కీర్తనల గ్రంథంలో ప్రార్థన అంటే ఏంటో, ఎలా చెయ్యాలో మరియు అందలి అంశాలను గూర్చి అనేక విషయాలు వ్రాయబడినా, ప్రార్థించేందుకు పాటించాల్సిన ఓ ముఖ్యసూత్రం కీర్త 66:18లో సూచించబడింది "నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసినయెడల ప్రభువు నా మనవి వినకపోవును". ఇది విశ్వాసులకు మరియు అవిశ్వాసులకు సంబంధించినది. యేసు రక్తము మన తప్పిదాలను, నెపములను కప్పదు. ఒప్పుకొన్న పాపాన్ని మాత్రమే పూర్తిగా కడిగివేస్తుంది. (సామె 15:29; 28:9; యెష 1:15; 59:1,2; యోహా 9:31; యాకో 4:3) ఆలాగే ప్రార్థించాల్సిన సమయాన్ని గూర్చిన సూత్రం కీర్త 69:13లో కనిపిస్తుంది. అనుకూల సమయం అంటే ఎప్పుడు? మనం ఏమి చేసినా ఈ రోజే, ఇప్పుడే చెయ్యాలని దేవుడు కోరుతున్నాడు. ఒక పాపి రక్షణ పొందడానికి (II కొరి 6:2) పరిశుద్ధులు తమ శరీరాలను దేవునికి సజీవయాగంగా అర్పించడానికి (రోమా 6:19; 12:1-3) ఒకరికొకరు బుద్ధి చెప్పుకోడానికి (హెబ్రీ 3:7,13,15). ఎందుకు అంతగా త్వరపడాలో కారణం సామె 27:1; యాకో 4:13-15లో కనిపిస్తుంది.

**14. వృద్ధాప్యంలోని ఆశీర్వాదం :** 71వ కీర్తనను వృద్ధుని కీర్తన అని చెప్పవచ్చును. సాధారణంగా ఈ లోకంలో ఏ రంగంలో నైనా అనగా వృత్తి, క్రీడలు మొదలైన రంగాలలో యౌవ్వనానికే ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. వీళ్ళందరూ వృద్ధాప్యంలో ప్రక్కన పెట్టబడతారు. కాని విశ్వాసి అందుకు భిన్నంగా మరింత యౌవ్వనాన్ని పుంజుకొంటాడు. విశ్వాసికి వృద్ధాప్యం తీసికొని వచ్చే గొప్ప ఆశీర్వాదం ఏమంటే, అది ఆ వ్యక్తిని క్రీస్తు పోలిక అనే మహిమాన్వితమైన లక్ష్యానికి అతి సమీపంగా తెస్తుంది. (కీర్త 71:5,9,17,18) ఎంతగొప్ప ధన్యత!

**15. మనిషికి కోపం - దేవునికి స్తుతి :** కీర్తన 76:10లో వ్రాయబడిన మాటలు వింతగా కనిపించినా అందులో నిగూఢమైన అర్థం ఉంది. ప్రత్యర్థులపై నరులు చూపించే ఆగ్రహం వారికి శాపంగా మారడానికి బదులు ఆశీర్వాదంగా మారి తద్వారా దేవుణ్ణి స్తుతించేందుకు కారణమౌతుంది. ఉదా:- యాకోబుపై ఏశావు ఆగ్రహం (ఆది 27:41-45; 29:10) యోసేపుపై అతని అన్నల కోపం (ఆది 37:23-28; 41:38-44); ఇశ్రాయేలుపై బాలాకు కోపం (సంఖ్యా 22:1-6; 24:17) యూదులపై హామాను కోపం (ఎస్తే 5:12-14; 7:10). ఇశ్రాయేలు రాజు ఆగ్రహం ధర్మశాస్త్ర ప్రతిని కాల్చివేస్తే, దానితోపాటు మరెక్కువ అంశాలతో తిరిగి వ్రాయబడింది. (యిర్మీ 36:22-32) యేసుక్రీస్తుపై పరిసయ్యుల కోపం సిలువలో దొంగ రక్షణకు, దేవుని మహిమకు కారణమైంది (లూకా 23:39-43). రోమా చక్రవర్తి ఆగ్రహం యోహాను పత్మాసులో బంధించబడి, ప్రకటన గ్రంథం వ్రాయడానికి కారణమైంది (ప్రక 1:9). కాబట్టి విశ్వాసీ! నీపై ఎవరైనా ఆగ్రహం చూపిస్తే దేవునికి స్తోత్రం చెల్లించు.

**16. కెరూబులు :** ఈ జీవుల ప్రస్తావన కీర్త 80:1 తో పాటు బైబిలులో 64 సార్లు ఉంది. వీటి మధ్య నుండి దేవుడు మోషేతో మాట్లాడాడు (సంఖ్యా 7:90) హిజ్కియా ప్రార్థనలో ప్రస్తావన (II రాజు 19:15) యెహెజ్కేలు కెరూబుల మధ్య దేవుని మహిమను చూచాడు (యెహె). కెరూబులు దేవుని మహిమ వాహకాలు. వెయ్యేండ్ల పాలనలోని మందిరంలో కూడ ఇవి ఉంటాయి (యెహె 41:17–20).

**17. ఫలభరిత జీవితం :** 80వ కీర్తన 8వ వచనంలోని ద్రాక్షావల్లి ఇశ్రాయేలు జాతిని సూచిస్తున్నది. దానిని దేవుడు ఐగుప్తునుండి తీసికొనివచ్చి తాను ఏర్పరచుకొన్న స్థలంలో నాటాడు. అది బాగా ఎదిగింది దాని తీగెలు యూఫ్రటీసునది వరకు, సముద్రము వరకు వ్యాపించాయి. (10,11 వచనాలు) తరువాత దేవుడు దాని కంచెను తీసివేసాడు (12వ) తన ద్రాక్షావల్లిని దేవుడు ఎందుకు అలాచేసాడు? కారణం యెషయా 5:1–4; యిర్మీయా 2:21 మరియు హోషెయా 10:1లో స్పష్టమౌతున్నది. ఇశ్రాయేలు అనే ఈ ద్రాక్షావల్లి తన ఫలాన్ని ఆకలిగొన్నవారికివ్వాలని దేవుడు దాన్ని నాటాడు. కాని అలా జరుగలేదు. కనుక తగిన కాలంలో దేవుడు దాన్ని ప్రక్కన పెట్టాడు (కీర్త 8:12,13,16). పరిసయ్యుల విషయం కూడా అలాగే జరిగింది. (మత్త 21:43) ప్రస్తుతం ఫలించే బాధ్యత విశ్వాసులకు అప్పగించబడింది. క్రీస్తు అనే ద్రాక్షావల్లిలో తీగెలైన విశ్వాసులు ఫలించాలి (యోహా 15:1–8). ఈ కీర్తనలో 10–14 వచనాల్లోని మాటల్లాగే 10 శతాబ్దాలనంతరం యేసు ఒలీవల కొండపై నిలిచి, యెరూషలేమువైపు చూస్తూ చెప్పాడు. (మత్త 23:37–39).

**18. ఉజ్జీవార్థమైన ప్రార్థన (85:6) :** ఉజ్జీవం కొరకు చేసే ప్రార్థనకన్న దేవునికి ఇంపైన ప్రార్థన మరొటి లేదు. దేవుని పిల్లలే ఉజ్జీవింపబడగలరు. పాపులు నిర్జీవస్థితి నుండి లేపబడాలి. అయితే జీవం పొంది చల్లారిన స్థితిలో ఉన్న విశ్వాసులు ఉజ్జీవించబడాలి. దాని కోసం ప్రార్థించాలి. అయితే ఉజ్జీవం కొరకు ప్రార్థించక ముందు పాపాన్ని విడచిపెట్టేందుకు తీర్మానించుకోవాలి (85:8,9). అది ప్రధానమైనది. బైబిల్లో అలాంటి పలు ఉజ్జీవాలను గూర్చి పేర్కొనబడ్డాయి. అవన్నీ బైబిలుపఠన ద్వారా ప్రార్థన ద్వారా మరికొన్ని ఈ రెండింటి ద్వారా జరిగాయి.

**19. ప్రార్థన యొక్క అద్భుత శక్తి (86:10) :** ఈ భాగంలో పరస్పర విరుద్ధమైన రెండు జంటపదాలు ఉన్నాయి. కృప మరియు సత్యం; నీతి మరియు సమాధానం. కృప పాపిని విడిచిపెట్టమంటుంది. కాని సత్యం పాపం వలన వచ్చే జీతం మరణం అంటుంది. సమాధానం పాపి కలవర హృదయాన్ని నిమ్మళింపజేయాలని చూస్తుంది. కాని నీతి పాపము చేసిన ఆత్మ చావాలి అంటుంది. ఇప్పుడేమి చెయ్యాలి? అద్భుతం జరిగింది. ప్రేమ, క్రీస్తు ద్వారా ఓ మార్గాన్ని కనుగొన్నది. తత్ఫలితంగా పరస్పరం విరుద్ధంగా ఉన్న ఈ రెండు ఒకదానినొకటి ముద్దుపెట్టుకొన్నాయి. దేవునికి మనిషికి గల సంబంధంలో ప్రేమ ద్వారా ఇది ఎలా సాధ్యం అయిందో విశ్వాసుల మధ్యగల సంబంధంలోను సాధ్యం కావాలి.

**20. మొదటి ఆదాము కీర్తన :** దైవజనుడైన మోషే వ్రాసిన 90వ కీర్తన మొదటి ఆదాము కీర్తన అని, మరణ గీతిక అనికూడ పిలువబడుతున్నది. ఎందుచేతనంటే ఈ కీర్తనలో మొదటి ఆదాము పాప ఫలితంగా కలిగిన పరిణామం స్పష్టంగా కనిపిస్తుంది (90:10ని ఆది. కా 5 అధ్యాతో పోల్చి చూడండి). 12వ వచనంలో విశ్వాసి, తన జీవితకాలాన్ని జ్ఞానంతో సద్వినియోగం చేసికోవాలని, అవిశ్వాసి, జ్ఞానానికి మూలమైన యేసును విశ్వసించాలని వ్రాయబడింది. వృధా చేసిన కాలం తిరిగి రాదు సుమా!

**21. రెండవ ఆదాము కీర్తన :** జీవగీతం అని పిలువబడే 91వ కీర్తన రెండవ ఆదాము కీర్తనగా కూడ పిలువబడుతున్నది. అందుకు కారణం, రెండవ ఆదామైన క్రీస్తు ఈ భూమ్మీద  సంచరించినప్పుడు తండ్రి ఆయనను కాపాడిన వైనాన్ని 91:11,12 లో చూడగలం. సాతాను ఆయనను శోధించినప్పుడు సాతాను ఇదే వచనాన్ని ఎత్తి చెప్పాడు. యేసు జీవితంలో దూతల పలువిధ పరిచర్య గూర్చి హెబ్రీ 1:6, లూకా 1:26-38; 2:8-14; మత్త 1:20-23; మత్త 4:11, లూకా 22:43; మత్త 28:2,6; అపొ 1:10, 11; II థెస్స 1:7,8) వ్రాయబడ్డాయి.

**22. దేవుని వాక్యం :** కీర్తన గ్రంథంలోని భక్తిగీతాలన్నిటిలో ప్రధానమైనది, అతి పెద్ద ప్రార్థన 119వ కీర్తన. ఈ ప్రార్థన మూలమంతా, దాని అర్థమంతా దేవుని వాక్యమే. ఇందులోని 176 వచనాల్లో 171 వచనాలు వాక్యం గూర్చే వ్రాయబడ్డాయి. వాక్యానికి 9 పర్యాయ పదాలు ఉపయోగించబడ్డాయి (1-7, 9, 91వచనాలు). వాక్యం మనలో 12 విధాలుగా కార్యం చేస్తుంది (9,25,28,38,42,50,98,99,105,114,116, 165,170 వచనాలు).

ప్రసంగికుల రాజు అయిన డి.ఎల్. మూడీ గారు కీర్తన 119:11 ను ఆధారం చేసికొని "బైబిలు ఒక వ్యక్తిని పాపానికి దూరంగా ఉంచుతుంది. లేదా పాపం అతన్ని బైబిలుకు దూరంగా ఉంచుతుంది". ఇంత శ్రేష్ఠమైన వాక్యానికి మనమెంత ప్రాధాన్యత నిస్తున్నామో పరీక్షించుకోవాలి. ఈ కీర్తనలోని 89వ వచనాన్ని ప్రభువు పదే పదే ప్రస్తావించాడు (మత్త 24:35; 5:18) దావీదు తన జ్ఞానాన్ని గూర్చి అతిశయించలేదు, ఆ ఘనతను తన సలహాదారులకు ఆపాదించలేదు కాని వాక్యానికే ఆపాదించాడు. (99వ) దేవుని వాక్యం మన పాదాలకు దీపము మన త్రోవకు వెలుగుగా ఉండి నడిపిస్తుంది (105వ) గాని, సాతాను వెలుగు మనిషి మనోనేత్రాలకు అంధత్వం కలుగుజేస్తుంది. దేవుని వాక్యం ఆధ్యాత్మిక శిశువులకు పాలుగా, ఎదిగిన వారికి బలమైన ఆహారంగా ఉంటుంది (130వ).

## II. పశ్చాత్తాప కీర్తనలు : (6,32,38,51,102,130,143)

ఈ 7 కీర్తనలలో 5 కీర్తనలను దావీదు వ్రాసాడు.

**1. పాప పరిణామము :-** 32వ కీర్తనకు 51వ కీర్తనకు సన్నిహిత సంబంధం ఉంది.

దావీదు 51వ కీర్తనలో తన పాపాన్ని ఒప్పుకొనకముందు, పాప ఫలితంగా పొందిన అనుభూతులను 32వ కీర్తనలో వ్రాసాడు. ఈ కీర్తనలోని 1,2 వచనాలను ఆధారం చేసికొని పౌలు “ఆపాదించబడుట” అనే గొప్ప సిద్ధాంతాన్ని వివరించాడు (రోమా 4:7,8). ఒక వ్యక్తి ఖాతాకు మరోవ్యక్తి చేర్చిన దానిని ఆపాదించుట, మోపబడుట, లేక సంక్రమించుట అంటారు. అలాంటివి బైబిల్లో మూడు ఉన్నాయి.

అ) ఆదాము పాప స్వభావం మానవ జాతికి సంక్రమించుట (రోమా 3:23; 5:12)

ఆ) మానవ పాపం క్రీస్తుపై మోపబడుట (యెష 53:5,6; హెబ్రీ 2:9; **II** కొరి 5:14-21; **I** పేతు 2:24)

ఇ) విశ్వసించిన పాపికి, క్రీస్తు నీతి ఆపాదించబడుట (ఫిలి 3:9; యాకో 2:23; రోమా 4:6-24)

**2. పాపపు ఒప్పుకోలు :** 51వ కీర్తనను దావీదు ఏ సందర్భంలో వ్రాసాడో మనందరికీ తెలుసు. దేవుడు ప్రతి పాపినుండి దేనిని కోరతాడో దానితో అతడు ఆరంభించాడు. అతని పాపాన్ని గుర్తించి ఒప్పుకొన్నాడు. తన పాపానికి కారణం మరేదో కాదని తానేనని అంగీకరించాడు. దేవుడు మనం చెప్పే నెపాలను అంగీకరించడు గాని పశ్చాత్తాపంతో కార్చే కన్నీళ్ళను అంగీకరిస్తాడు. దావీదు బెత్షెబకు, ఊరియాకు, తనను నమ్మిన ఇశ్రాయేలీయులకు విరోధంగా పాపం చేసాడు. అది దేవునికి విరోధంగా చేసిన పాపమని గుర్తించాడు (51:4). మనం చేసే పాపాలు ఇతరులకు విరోధంగా చేసినట్లు అనిపిస్తాయి. కాని అవి దేవునికి విరుద్ధమైనవి. తన పాపశుద్ధీకరణ కోసం దావీదు ప్రార్థన చేసినప్పుడు (51:7) బహుశా నిర్గ 12:21-23 జ్ఞాపకం చేసికొని ఉండవచ్చును. దావీదు వంశంలో నుండి వచ్చిన యేసు క్రీస్తు విశ్వాసులందరికోసం ప్రతిరోజు ఈ పరిచర్యను చేస్తున్నాడు (హెబ్రీ 1:3). మన పాపం మనలో నివసించే పరిశుద్ధాత్మను దుఃఖపర్చేంతగా ఉండకూడదు (11వ). విశ్వాసి తన మొదటి ప్రేమను కోల్పోయినప్పుడు (ప్రక 2:4) ఎలా ప్రార్థించాలో 12వ వచనం నేర్పిస్తుంది. రక్షణానందాన్ని తిరిగి పొందిన వారిలోని మార్పును 13వ వచనం తెలియజేస్తుంది. ఈ కీర్తన మరో ముఖ్యమైన సత్యాన్ని బోధిస్తుంది. ధర్మశాస్త్రం ప్రకారం వ్యభిచార పాప పరిహారానికి ఏ బలి లేదు. ఆవ్యక్తి చంపబడాలి (లేవీ 20:10). కాబట్టి దావీదు తనను తానే, అనగా విరిగి నలిగిన హృదయాన్ని బలిగా అర్పించి దేవుని కృపకు అప్పగించుకున్నాడు.

## III. శాప గీతాలు : (35,55,58,59,69,83,109,137,140)

ఈ కీర్తనలను మత్తయి 5:44తో పోల్చితే కొంత వివాదాస్పదంగా కనిపిస్తాయి. ఈ కీర్తనలలో ఇతరులకు వ్యతిరేకంగా వారికి కీడు జరగాలని ప్రార్థించడం గమనించవచ్చు. అది సబబేనా? డా॥ రాయ్. ఎల్ ఆల్డ్రిక్ వీటిని గూర్చి చెప్పిన విషయాలను గమనిద్దాం.

1. ఈ కీర్తనలన్నీ పరిశుద్ధాత్మ ప్రేరణలో వ్రాయబడ్డాయి. ఆయనకు పాపి యొక్క పాపాన్ని ఖండించే అధికారం ఉంది.

2. అది ధర్మశాస్త్రానుసారమైనదే. (సామె 28:4; యిర్మీ 50:15)

3. కీడుకు మరియు కీడు చేసేవారికి అలాంటి తీర్పు ఉంటుందని క్రీస్తు బోధల్లోను, పత్రికలలోను కనిపిస్తుంది. (మత్త 18:6; 23:33; గల 1:8,9; 5:12; యాకో 5:3; యూదా 13, 15; **II**పేతు 2:12, 22; **II** థెస్స 2:10-12; ప్రక 14:10,11).

4. లేఖనాలు, పాపము చేసే ఇశ్రాయేలీయులందరికీ శాపాలను ప్రకటించాయి లేక ఉచ్ఛరించాయి. (లేవీ 26 అధ్యా; ద్వితీ 27-28 అధ్యా. యెష 5:24,25; 28:13).

5. వ్యక్తిగతంగా దావీదు, తాళిమి మరియు క్షమా హృదయం గల వాడే, కాని ఈ మాటలను పలకడం వలన అతడు దేవుని పనిని తన పనిగా ఎంచాడు (5:10,11). ముఖ్యంగా ఎక్కువగా నలిగిన వారికి కలిగిన బాధను బట్టి వారిపట్ల జాలితో పలికిన మాటలివి (10:8-10).

6. కొన్ని శాపాలు ప్రవచనాత్మకంగా చెప్పబడ్డాయి. (కీర్త 137:8,9) (యెష 13:16; యిర్మీ 50:15; 51:6,36 కూడ చదవండి).

7. మరికొన్ని యుద్ధాలలో పొందిన జయాన్ని బట్టి చేసిన ప్రార్థనలు (కీర్త 144:5-7)

8. కొన్ని శాపాలు క్రీస్తుకు ద్రోహం చేసిన వారిని గూర్చి పలుకబడ్డాయి. (40,55,60) 69:22-25 లో యూదా ఇస్కరియోతుకు కలిగేశిక్షను గూర్చి ప్రస్తావించబడింది.

9. ఈ కీర్తనలు, దుష్టులను ఆధ్యాత్మిక భ్రష్టులని నిశ్చయంగా చెప్తూ దేవుని సార్వభౌమత్వాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రవచనాత్మకంగా వ్రాయబడ్డాయి. దుష్టులకు ఈ భూమ్మీద జరుగబోయే అంతిమ తీర్పు కొరకు కనిపెడుతున్నట్లు ఈ కీర్తనలు స్పష్టం చేస్తున్నాయి.

10. వారిని పదే పదే హెచ్చరించడం ద్వారా వారి పట్ల గల కృప ధైర్యంగా వెల్లడించబడింది.

**IV. (మహోన్నతమైన) ఔన్నత్య గీతాలు :** ఇవి మొత్తం 15. వీటిలో 10 కీర్తనలను అనగా 120,121,123,125,126,128-130; 132,134 హిజ్కియా వ్రాసాడు. 127వ కీర్తనను సొలొమోను మిగతా నాలుగింటిని అనగా 122,124,131,133 దావీదు వ్రాసాడు క్రీ.పూ. 728లో స్వస్థతను పొందిన హిజ్కియా కృతజ్ఞతా పూర్వకంగా వీటిని వ్రాసాడు. వాటిని దేవుని మందిరంలో ప్రజలందరూ అర్ధవలయాకారంలో నిలిచి ఉండగా గాయక బృందం ఉన్నత స్థలంలో మెట్ల పై నిలబడి పాడాలి. వాటి రాగాలు కూడ క్రమేణ అతి తారస్థాయికి పెరుగుతాయి. వీటిలో వివిధ వార్షిక పండుగల కొరకు యెరూషలేముకు వెళ్ళే యాత్రికులు పాడుకొనే పాటలు కూడ ఉన్నాయి.

**V. హల్లేల్ (హల్లెలూయ) కీర్తనలు (113-118) :** ఈ ఆరు కీర్తనలు కూడ పస్కా ఆచరించే రాత్రి పాడాలి. భోజన ఆరంభంలో 113, 114వ కీర్తనలు, ముగింపులో 115, 116వ కీర్తనలు పాడాలి. యేసు ప్రభువు, ఆయన శిష్యులు కూడ వీటిని

పాడారు. (మత్త 26:30), నేటికీ, ప్రతి సంవత్సరం పాలస్తీనలోని యూదులు వివిధ సందర్భాలలో 18 సార్లు, పరిశుద్ధ స్థలానికి వెలుపలనున్న యూదులు 21 సార్లు ఈ కీర్తనలను పాడుకొంటారు.

**VI. చరిత్రాత్మక కీర్తనలు (70, 105, 106) :** ఇవి ఇశ్రాయేలు చరిత్రను గూర్చిన కీర్తనలు. వీటిలోని అంశాలను రెండు భాగాలుగా పేర్కొనవచ్చును.

1. ఇశ్రాయేలు పాపము (78:10,11,19,22,36,40,41,42,58; 106:13, 19,24,25,28,35,37,38)
2. దేవుని కృప (78:13,14,15,24,38,43,54,55,70,71; 105:8-11,14,17, 27-37; 106:43,44).

**VII. అక్షరమాల కీర్తనలు (బంధకావ్యం) :** 9,10,25,34,37,111,112, 119,145వ కీర్తనలు, ప్రతి వరుస కూడ హెబ్రీ అక్షరమాలలోని ఏదో ఒక అక్షరంతో ఆరంభం అవుతుంది. 119వ కీర్తనలో 22 భాగాలున్నాయి. ప్రతి భాగంలోని 8 వచనాలు ఒక హెబ్రీ అక్షరంతో ఆరంభమౌతాయి. మిగతా కీర్తనల్లో ఈ క్రమం లేదు. 9,10,25 కీర్తనల్లో చాలా అక్షరాలు లేవు. 34,35, కీర్తనల్లో ఒక్క అక్షరం తప్ప మిగతావన్నీ ఉన్నాయి. 37,111,112,119 వ కీర్తనల్లో అన్ని అక్షరాలు ఉన్నాయి. ప్రజలు వీటిని జ్ఞాపకం ఉంచుకొనేందుకు వీలుగా ఇలా వ్రాయబడ్డాయి.

**VIII. మెస్సీయా కీర్తనలు :** ఇవన్నీ ద్వంద్వ విధానంలో వ్రాయబడిన ప్రాముఖ్యమైన కీర్తనలు.

ఎ. మెస్సీయాను గూర్చిన విషయాలు - కీర్తనల గ్రంథం - క్రొత్త నిబంధనలో నెరవేర్పు.

1. ఆయన విధేయత - 40:6-10 - హెబ్రీ 10:5-7
2. ఆయన ఆసక్తి - 69:9 - యోహా 2:17
3. ఆయన తిరస్కరించబడుట - 118:22 - మత్త 21:42
4. ఆయన అప్పగించబడుట - 41:9; 55:12-14 - మత్త 26:14-16, 21-25)
5. ఆయన శ్రమలు - (22:1,6,7,8,16,19; 69:21; 31:5,34;20; 129:3) - మత్త 27:34-48 లూకా 23:46; యోహా 19:33-36)
6. ఆయననుగూర్చి చెప్పబడిన అబద్ధసాక్ష్యాలు-109:2,3-మత్త 26:59-61; 27:39,44)
7. శత్రువుల కోసం ఆయన చేసిన ప్రార్థన - 109:4 - లూకా 23:34
8. ఆయన పునరుత్థానం - 16:10; 22:22 - అపొ. 13:35; యోహా 20:17
9. ఆయన ఆరోహణం - 68:18; 24:7,8 - ఎఫె 4:8; అపొ 1 అధ్యా.
10. ప్రధానయాజకుని పని - 110:4 - హెబ్రీ 5-7 అధ్యా.
11. వివాహం - 45:2,6,8,13,15 - ప్రక 19 అధ్యా.

12. అన్యుల నాశనం - 110:1,6; 2 కీర్త - ప్రక 6-19 అధ్యా.

13. వెయ్యేండ్ల పాలన - 89:27; 102:16-21;72:17-మత్త 23:39; ప్రక 11:15.

బి. కీర్తనల గ్రంథంలోని వరుస క్రమం. వీటిలో కొన్ని ప్రాముఖ్యమైన వాటిని చూద్దాం.

1. 24వ కీర్తన క్రీస్తు పరలోక ప్రవేశాన్ని సూచిస్తున్నది. ఇది రెండు గాయక బృందాలు పాడినది. 1-3 వచనాల్లో మొదటి బృందం వేసిన ప్రశ్నకు 4-6 వచనాల్లో రెండవ బృందం జవాబిస్తున్నది. ఇది ఓ కొండ దిగువ భాగాన పాడినది. 7-10 వచనాలు పట్టణ ద్వారం వద్ద పాడినది.

2. మందిరంలో ఉదయారాధనలో పాడే పాటలు : సోమవారం 48వ కీర్తన, మంగళవారం 82వ కీర్తన, బుధవారం 94వ కీర్తన, గురువారం 81వ కీర్తన, శుక్రవారం 93వ కీర్తన, శనివారం 92వ కీర్తన, ఆదివారం 24వ కీర్తన.

3. 45వ కీర్తన బహుశా ఐగుప్తురాజు కుమార్తెతో సొలొమోనుకు జరిగిన వివాహాన్ని ఆధారం చేసికొని వ్రాయబడి ఉండవచ్చు. కాని ఈ చారిత్రాత్మక గీతం సంఘంతో క్రీస్తుకు జరుగబోయే వివాహానికి సరిగ్గా సరిపోయింది (ప్రక. 19:7-9). ఈ కీర్తన మొదటి భాగంలో పెండ్లి కుమారుని లక్షణాలు (1-8వ) రెండవ భాగంలో పెండ్లి కుమార్తె ఆధిక్యతలు (8-17వ) వ్రాయబడ్డాయి. 6,7 వచనాలు హెబ్రీ 1:8,9వ వచనాలలో ప్రస్తావించబడ్డాయి.

4. దావీదు సింహాసనం : దావీదు సింహాసనాన్ని స్థిరపరచుటలో దేవుని మారని విశ్వాస్యతను గూర్చిన ప్రవచనం 89వ కీర్తనలో వ్రాయబడింది. ఆ రాజవంశంలో అవిధేయత కొనసాగుతూ ఉన్నా దేవుడు మరో విధానంలో అతని సింహాసనాన్ని స్థిరపర్చాడు. ఈ కీర్తనను వ్రాసిన ఎజ్రాహీయుడైన ఏతాను సొలొమోను పాలనా కాలంలో ఒక జ్ఞాని. (I రాజు 4:31) కీర్త 89:27 లోని మాటలు ఫిలి 2:9-11లో వివరించబడ్డాయి.

5. క్రీస్తు నిత్యత్వం (కీర్త 102) : ఈ కీర్తన బహుశా బబులోను చెరకాలం ముగింపులో, యూదులు తిరిగి యెరూషలేమును కట్టాలని ప్రోత్సహించడానికి వ్రాయబడి ఉండవచ్చును. యెరూషలేము యొక్క మహారాజు పునరాగమనమును గూర్చి కూడ 16వ వచనంలో వ్రాయబడినది. 25-27 వచనాలలోని మెస్సీయా ప్రవచనం హెబ్రీ 1:10-12 లో ప్రస్తావించబడింది.

6. క్రీస్తు శాశ్వత యాజకత్వం : క్రీస్తును ప్రధాన యాజకునిగా వర్ణిస్తూ వ్రాయబడిన 110వ కీర్తనలో కీర్తనాకారుడు క్రీస్తును ఐదు విధాలుగా వర్ణించాడు ఆయన దేవుడని (1వ) రాజని (2వ) యాజకుడని (4వ) న్యాయాధిపతి అని (5వ) యోధుడని (6వ) వర్ణించాడు. అలాగే క్రీస్తు ప్రజలను రెండు విధాలుగా వర్ణించాడు. క్రీస్తు ప్రజలు యాజకులు (3వ). ప్రక 1:6 తో పోల్చి చూడండి. క్రీస్తు ప్రజలు సైనికులు (3వ) ఎఫె 6:11 తో పోల్చిచూడండి.

110:1 లో వ్రాయబడిన "ప్రభువు నా ప్రభువుతో సెలవిచ్చిన వాక్కు - నేను నీ శత్రువులను నీ పాదములకు పీఠముగా చేయువరకు నాకుడి పార్శ్వమున కూర్చుండుము." అన్న మాటలు పాత నిబంధనలోని ఇతర వచనాలన్నిటి కన్న ఎక్కువ సార్లు క్రొత్త నిబంధనలో పునః ప్రస్తావించబడ్డాయి. మత్త 22:41-46లో క్రీస్తు దైవత్వాన్ని గూర్చి, అపొ. కా 2:34, 35 లో క్రీస్తు గుర్తింపును గూర్చి హెబ్రీ 1:13లో క్రీస్తు ఔన్నత్యాన్ని గూర్చి, హెబ్రీ 10:12, 13 క్రీస్తు పూర్తి చేసిన కార్యాన్ని గూర్చి తెలిపేందుకు ఉపయోగించబడ్డాయి.

అలాగే ఆయన యాజకత్వానికి సంబంధించిన "మెల్కీసెదెకు క్రమము చొప్పున నీవు నిరంతరము యాజకుడవై యుందువు" అన్న మాటలు కూడ మూడు పర్యాయాలు పేర్కొన బడ్డాయి. (హెబ్రీ 5:6; 6:20; 7:21) ప్రధాన యాజకునిగా క్రీస్తు లక్షణాలను, మార్పులేని యాజకత్వాన్ని, ఆ యాజకత్వపు అవసరతను సూచిస్తూ వ్రాయబడ్డాయి.

7. ముఖ్యమైన మూలరాయి : 118వ కీర్తన క్రీస్తును దేవుని నిర్మాణంలో మూలరాయిగా వర్ణిస్తున్నది. అది మనుష్యులచే విసర్జించబడింది గాని దేవునిచే ఏర్పరచబడినది. సాధారణంగా పర్ణశాలల పండుగ సమయంలో ఈ కీర్తనను పాడేవారు. బహుశా ప్రభువు గెత్సేమనేకు వెళ్ళే మార్గంలో ఈ పాటను పాడి ఉండవచ్చును. 22లో వ్రాయబడిన ఈ రాయి లేఖనాలలో అత్యున్నతమైన రాయి. దీనిని గూర్చి పాత నిబంధనలోను క్రొత్త నిబంధనలోను పలు విధాలుగా వర్ణించబడింది. ఆయన మూలరాయి (మత్త 21:42; ఎఫె 2:20), తలరాయి (పైరాయి) (జెక 4:7; అపొ 4:11) కొట్టబడిన రాయి (I కొరి 10:4) అడ్డుబండ (I పేతు 2:7) విరుగగొట్టే రాయి (దాని 2:34) సజీవమైన, ఏర్పరచబడిన, అమూల్యమైన రాయి. (Iపేతు 2:4-7).

ప్రియ సోదరా! సోదరీ! అటువంటి శ్రేష్ఠమైన రాయి వద్దకు మనం వచ్చాము. ఎందు నిమిత్తం వచ్చామో తెలుసా? యేసు క్రీస్తు ద్వారా దేవునికి అనుకూలములగు ఆత్మ సంబంధమైన బలులర్పించుటకు, పరిశుద్ధయాజకులుగా ఉండునట్లు, మనము కూడ సజీవమైన రాళ్ళవలె నుండి ఆత్మ సంబంధమైన మందిరంగా కట్టబడాలి. ఈ బాధ్యతను నిర్వర్తిస్తూ ఉండగా, పలు గాయకుల, కీర్తనాకారుల అనుభవాలతో నిండి ఉన్న కీర్తనల గ్రంథం మన జీవిత అనుభవంగా మారిపోవాలి. అట్టి కృప ప్రభువు మనకు దయచేయును గాక!

**TTB - Telugu - Study Outlines - Book of PSALMS**

Printed by : Premadhara, Trans World Radio - India, 12-1-334/17/3,
Lalapet, Secunderabad - 500 017. Ph : 040-27003011

**FREE** MP3 DOWN LOAD - Log on to :
**www.radio882.com**